ప్రేమించిన అమ్మాయి కోసం కన్నవాళ్లని ఎదిరించిన అతనికి తెలిసిన చేదు నిజం?

# ఆటబొమ్మ

సి.చెన్నప్ప కథ

ఉదయాన్నే లేచి కాలేజీ పుస్తకాలు చదువుకుంటున్న నేను ఉలిక్కిపడి తలెత్తి చూశాను

ఎదురుగా వున్న ఇంటి వరండాలో 'రాకోయీ అనుకోనీ అతిథీ' అంటూ కూని రాగం తీస్తూ మెరుపుతీగలాంటి ఓ అమ్మాయి! ఆమె కూడనావైపు యథాలాపంగా, కన్నార్పకుండా కొన్ని క్షణాలు చూసి, కనురెప్పలు టపటపలాడించి, టవలుతో తలవెంట్రుకలు తుడుచుకుంటూ నావైపే నవ్వుతూ చూస్తోంది. నా గుండె ఆ క్షణాల్లో లయ తప్పినట్లనిపించింది. ఇక చదవబుద్ధి కాలేదు. అమ్మ పిలవడంతో, నేను ఇంట్లోకి వెళ్లి, టిఫిన్ కానించి, కాసేపటి తర్వాత కాలేజీకి బయలుదేరాను.

ఆ రోజు కాలేజీకి వెళ్లానన్న మాటేగానీ క్లాసుల్లో నేను ఏ మాత్రం 'అటెంటివ్'గా వుండలేకపోయాను. కాలేజీ వదిలారు. సాయంత్రం అయ్యింది. మా ఇంటికి వెళుతున్నాను. దారిలో ఆ అమ్మాయి కనిపించగా మాట్లాడాలనిపించింది. వేగంగా నడుస్తూ ఆమెను సమీపించాను. అప్పటికి ఇద్దరమూ పాతవూరు పోస్టాఫీస్ దగ్గరకు వచ్చాము.

ఎలాగో ధైర్యం చేసి "ఏమండీ!" అని పిలిచాను.

"ఏమిటండి!" అందా అమ్మాయి నవ్వుతూనే.

"మీరు మా ఎదురింట్లో కొత్తగా చేరినారా?"

"ఔనండీ!"

"మా అనంతపురానికి మీరు ఏ వూరు నుండి వచ్చారు?"

"కడప!"




ఆ మాటవింటూనే నా గుండెల్లో బాంబు పడ్డంత భయం వేసింది.

''మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?'' అడిగాను కొంచెం ధైర్యం తెచ్చుకుంటూ.

''సుజాత!'' అంది గంభీరంగా.

'థాంక్యూ' అన్నాను.

''నా పేరు చెప్పినంత మాత్రానికే థాంక్స్ చెప్తారేమిటి'' అంది నవ్వుతూ.

'అదంతే లెండి!' అన్నాను తలదించుకు ని నవ్వుతూ. మళ్లీ నేనే

"మరి నా పేరు..." అంటూ చెప్పబో యాను.

"తెలుసు— వంశీ" అంది నవ్వుతూ.

స్టన్నయ్యాను. "అరె! మీకెలా తెలుసూ ?" అన్నాను ఆశ్చర్యంగా.

"ప్రొద్దున మీ ఇంటి వరండాలో చదువు కొంటూ వుంటే మీ అమ్మగారు మిమ్మల్ని పేరుపెట్టి పిలిచినప్పుడు" అంది ఒక్కొక్క మాట వత్తి పలుకుతూ మళ్లీ నవ్వుతూ చిలిపిగా.

(అంటే! నన్ను మరీ అంత 'ఇదిగా' గమనిస్తోందా ఏమో!?)

"అడక్కూడదు కానీ మీరిప్పుడు ఎక్క డికి వెళుతున్నారు?" అన్నాను చాలా సౌమ్యంగా.

"మా చిన్నాన్న ఇంటికి" చెప్పింది ఆమె", ఈ రోడ్డు మలుపు తిరిగి పది అడుగులు వేస్తే వస్తుంది" ఆమె రోడ్డు మలుపు దగ్గర ఆగింది. నేను కూడా ఆగాను. ఇద్దరిమధ్యా మౌనం. నేల చూపులు చూస్తూ ఆమె. బరువెక్కిన గుండె బరువు దించుకోవాలని చూస్తూ నేను.

"నేను ఇలా మీ వెంట పడుతూ వచ్చినందుకు మీరేమీ నన్ను అపార్థం చేసుకో రుగా" అన్నాను చివరికెలాగో.

"అలాంటిదేం లేదు. మీదంతా వట్టి భ్రమ" అంది గంభీరంగా. ఆ తరువాత ఆమె రోడ్డు మలుపు తిరిగి నాకనుమరుగ య్యింది. చీకటి పడుతోంది.

నేను తిరిగి ఇంటికి వచ్చాను. ఈరాత్రి నా కెందుకో ఆకలి వేయడం లేదు. ఏదో తిన్నా ననిపించి మా ఇంటి వరండాలో మంచం వేసుకొని లైటు ఆర్పివేసి పడుకు న్నాను. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. మనసంతా ఒక తెలియని ఆనందం. ఒక తీయని బాధ.

* * *

కాలేజీ ఫైనలియర్ పరీక్షలు వచ్చాయి. శ్రద్ధగా చదివి మరింత జాగ్రత్తగా పరీక్షలు వ్రాశాను. నా కృషి ఫలించి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. ఇక ఉద్యోగాల వేట మొదల య్యింది. తిరుపతిలో టెస్టు, ఆ తర్వాత కొన్ని నెలలకు ఇంటర్వ్యూ జరిగాయి. ఏడుకొండల వాడి దయతో ఒక బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి అనే వూరికి పోస్టింగ్ ఆర్డర్స్. ఆ వూరు హైదరాబాద్ నుండి దాదాపు మూడు గంటల ప్రయాణం అని తెలుసుకున్నాను. ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధం అవుతున్నాను.

మా ఇంటి గుమ్మం దగ్గర కాలి మువ్వల శబ్దం విన్పించింది. తలెత్తి చూశాను. ఎదురుగా సుజాత!— చేతిలో ఏదో ప్యాకెట్టుతో— నాకిష్టమైన చెంగావి రంగు చీరలో, నా కలల రాణిలా వస్తోంది.

"మా అమ్మ ఈ స్వీట్సు ప్యాకెట్టు మీకు ఇచ్చి రమ్మంది" అంది నా వైపు చూస్తూ.

ఎదురుగా మా నాన్న "ఎవర్రా ఆ అమ్మాయి", అనుమానంతో అడగనే అడి గాడు. నేనువెంటనే ఏంచెప్పాలో తెలియక

నీళ్ల నములుతూ నిలబడ్డాను.

అంతలో మా అమ్మ నన్ను రక్షించింది, "మన ఎదురింటి అమ్మాయి— చాలా సంప్రదాయంగల కుటుంబం. వాళ్ల అమ్మ గారితో చెప్పాను— మన అబ్బాయికి ఉద్యోగం వచ్చింది, ఈ రోజే ప్రయాణం అని— అందుకని అభిమానంతో పంపించి వుంటుందండీ" అంది. అమ్మ ప్యాకెట్టు తీసుకుని లోపలికి వెళ్లింది.

సుజాత "వెళ్లొస్తానండీ! నమస్తే" అంది నాన్నతో.

"మంచిది! వెళ్లిరా అమ్మాయ్" అన్నాడు నాన్న నాకు కావలసిన పుస్తకాలు బ్యాగులో సర్దుతూ.

ఆమె నావైపు చూస్తూ బయటకు రమ్మన్నట్లు సైగ చేసింది.

"మీరు వెళ్లండి— నేను తర్వాత వస్తా— నాన్న చూస్తున్నారు" అనే అర్థం వచ్చేలా నేను కూడ సైగలు చేస్తూ పంపించాను. ఆమె వాళ్ల వరండాలో నాకోసమే ఎదురు చూస్తున్నట్లు నిల్చొని వుంది. నేను అది గమనించి మా ఫ్రెండ్స్‌ను కొందరిని చివరి సారిగా కలిసివస్తానని నాన్నగారితో చెప్పి బయటపడ్డాను. ఆమె కూడ రోడ్డు మీదకు వచ్చింది. ముందు ఆమె, కొద్ది దూరంలో వెనుకగా నేను నడుస్తూ రైల్వే స్టేషన్ దగ్గరికెళ్లాం. అక్కడ ఓవర్ బ్రిడ్జి మీద కూర్చున్నాం.

"ఏమిటండీ! ఇంత దూరం లాక్కొచ్చారు నన్ను" అన్నాను.

"మీరు ఈ రోజే వూరికి వెళ్లాలా?" అంది సుజాత.

"అవును" అన్నాను పొడిగా.

ఇద్దరి మధ్యా మౌనం. ఆమె శూన్యంలోకి చూస్తూ కొంచెం దిగులుగా వుంది.

నేను నిశ్శబ్దంగా నవ్వుతూ "ఈ కాగితం ముక్క విప్పి చూడండి" అంటూ ఒక పేపర్ అందించాను. ఆమె చదవటం మొదలెట్టింది.

## సాయంత్రం



ఒక మంత్రి మరొక మంత్రిని అడిగాడు—

"స్వాతంత్ర్యం వచ్చి 46 ఏళ్లు అయిందని మీకెలా తెలుసు!"

"మా పి.ఏ. చెప్పాడులే"... టక్కున చెప్పాడు రెండో మంత్రి.

—బి.మల్లికార్జునరావు
(పెద్దాపురం)

వెన్నెల ప్రవహిస్తోంది
జలపాతంలా...
గగన పర్వతం పైనుండి
ధరణీ మైదాన తలమునకు
కోరిక తొలుస్తూంది
తేనెటీగల్లా..
నీరూపమనే తేనె పొదను
నా కళ్ల వోళ్లతో తాగడానికి
వేదన మిగులుతోంది
ఆరిపోయిన ఆశదీపపువత్తిలా..
నిన్ను చూడలేనన్న బాధకు
నీవిక కానరావన్న నిరాశతోడే..

— రాత్రి 2 గం. 30.ని.

చదవడం పూర్తయిన తర్వాత ఆమె ముఖం వికసించింది. పేపరు తిరిగి ఇచ్చేస్తూ అంది, "మీరు కవిత్వం వ్రాస్తారా? చాలా బావుంది. ఈ టైం ఏమిటి రాత్రి 2.30 అని వ్రాశారు. అంతవరకు మేల్కొనే వున్నారా?"

"అవును! ప్రేమలో పడ్డవాళ్లకు ఆకలి వేయదు— నిదుర పట్టదు" అన్నాను.

ఆ మాటలకు ఆమె నావైపు అలా కొన్ని క్షణాలు చూస్తూ ఉండిపోయింది.

నేను చిన్నగా నవ్వుతూనే "చీకటి పడుతోంది— పైగా నా ప్రయాణం ఇక వెళ్తామా?" అంటూ లేచి నిలబడ్డాను. ఆమె కూడ లేచి నిలబడింది. చుట్టూ చీకటి. ఎవరూలేని ఏకాంతం. మేం ఇద్దరమే . ఉన్నట్లుండి ఆమె నన్ను తన హృదయాని కి హత్తుకొని నా చెంపలతో ఆమె చెంపలను ఆనించింది. నేను అచేతనుడయ్యాను. మెల్ల గా ఆమె నన్ను వదలి నడవటం మొద లెట్టింది. నేను కూడ ఆమె ప్రక్కనే మౌనంగా నడుస్తున్నాను. మా ఇళ్లు సమీపి స్తుండగా 'వెళ్లొస్తాను సుజా!' అన్నాను. ఆమె సరేనన్నట్లు తలవూపి దిగులుగా ఒకక్షణం చూసి చకచకా ముందుకెళ్లిపోయి ంది వాళ్లింటికి.

ఆ రాత్రి హైదరాబాద్‌కు వెళ్లడానికి బస్టాండుకు వచ్చాను. నాతోపాటే నాన్న కూడా వచ్చారు బస్టాండుకు. నాన్న ముఖం లో దిగులు— నన్ను దూరప్రదేశం పంపిస్తు న్నందుకు. చెప్పవలసిన జాగ్రత్తలు అన్నీ చెప్పి, ప్రతీ వారానికీ కనీసం ఒక ఉత్తరం వ్రాయమని, ఉత్తరాల్లోనే నన్ను చూసుకుం టానని మరీమరీ చెప్పి, వదలలేక, వదలలేక నాకు వీడ్కోలు చెప్పారు మా నాన్న.

మరుసటి ఉదయానికి కామారెడ్డి చేరా ను. కొత్త ప్రదేశం— కొత్త మనుషులు— కొత్త వాతావరణం. మొదట్లో కొంచెం భయంగా కూడ వుండేది. బ్యాంకు లోపల, బ్యాంకు బయట అందరూ నన్ను అభిమాన ంతో చూస్తూ, ఆప్యాయతతో కలిసి పోవడం నాకు ఆనందాన్ని కలుగజేసింది. అయితే రాత్రుల్లో ఒంటరిగా నా రూమ్‌లో ఉన్నప్పు డు మాత్రం సుజాత జ్ఞాపకాలు నన్ను కలవరపెడుతూ వుండేది. ప్రతిరాత్రి సుజా తను చూడాలి అనే తీవ్రమైన కోరిక, ఆ కోరిక తీరనందుకు తీవ్రమైన బాధ. ఒక్కో రాత్రి కుమిలి కుమిలి ఏడ్చుకునేవాడిని.

* * *

దసరా పండుగకు రమ్మని నాన్న నుండి ఉత్తరం వచ్చింది. పండుగకు ఒకరోజు

ముందుగా అనంతపురానికి వచ్చాను. ఆ రోజు సాయంత్రం నా కోసమే ఎదురు చూస్తున్నట్లు సుజాత వాళ్ల యింటి వరండాలో వుంది. నేను బయటకు రావడం గమనించి తను కూడ రోడ్డు మీదకు వచ్చి నడవసాగింది. ఇద్దరం రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లాం. అక్కడ ఓవర్ బ్రిడ్జి పైన ఒకచోట కూర్చున్నాం.

'బాగున్నావా సుజా!' అన్నానుచనువుతో.

"ఊ!" అంది. మళ్లీ తనే "మీరేమిటి ఇంకా చిక్కిపోయారే?" అంది.

"టైఫాయిడ్ వచ్చింది అక్కడ— పదిరోజులు— నిజం! మా అమ్మమీద ఒట్టు" అన్నాను.

"అయ్యయ్యో!" అంటూ బాధపడింది.

"ఇప్పుడు తగ్గిందిలే— బాగానే వున్నాను" అన్నాను నవ్వుతూ

కొంచెం సేపు తర్వాత సుజాత అంది "మీ అమ్మా నాన్నలకు మీరంటే చాలా ఇష్టమా?" అంది.

"ఎందుకలా అడుగుతున్నావు?" అంటూ ఎదురు ప్రశ్న వేశాను.

"ఊర్కే—నే" అంది.

"అవును ఇష్టమే" అన్నాను.

"మీక్కూడా వాళ్లంటే ఇష్టమా?"

"అవును సుజా! చాలా ఇష్టం. నేనింత వాడ్ని కావడానికి వాళ్లే కారణం కదా!" అన్నాను.

"మన పెళ్లికి వాళ్లు ఒప్పుకోకపోతే?" శూన్యంలోకిచూస్తూసీరియస్‌గా అడిగింది.

"చూడు సుజా! నేను సమయం చూసి మా అమ్మా నాన్నలకు మంచిగా మన విషయం చెబుతాను. వాళ్లు సహృదయంతో అర్థం చేసుకొని మనల్ని ఆశీర్వదిస్తే నాకు ఆనందమే" అన్నాను.


"అలా జరుగకపోతే?" అడిగింది అనుమానంతో.

"వాళ్ల నుండి వేరుగా వచ్చి అయినాసరే — నిన్ను పెళ్లి చేసుకుంటాను అన్నాను దృఢంగా, కాస్త ఆవేశంగా.

## కన్నీళ్ల సినిమా

ప్రముఖ హిందీ నటుడు జాకీ ష్రాఫ్‌కు 'హరేరామ హరేకృష్ణ' చిత్రం కన్నీళ్లను తెప్పిస్తుందట. ఆ సినిమా చూసినపుడల్లా జనమత్ అమన్‌లాటి సోదరి నాకు లేదని నేనెంత బాధపడ్తూ ఉంటాను అంటున్నాడీ హీరో! నా హృదయాన్ని కదిలించిన సినిమా "హరేరామ హరేకృష్ణ' అని కూడా అంటున్నాడు జాకీ ష్రాఫ్!!

– జూపిటర్



ఆ మాటలకు కొన్ని క్షణాల వరకు ఆమె తదేకంగా నావైపు చూస్తూండిపోయింది. "చీకటి పడుతోంది ఇక వెళ్తాం" అంటూ లేచి నిలబడ్డాను. ఆమె కూడా లేచి నుంచుంది. ఇద్దరం మౌనంగా ఎవరి ఇంటికి వారు చేరుకున్నాం.

పండుగ అయిపోయింది. ఆ రాత్రే నేను వూరికి వెళ్ళి పోయాను. పదిరోజులైనా తిరగకుండానే దీపావళి పండుగ నెపంతో మళ్లీ అనంతపురంకు వచ్చాను. లెటరైనా వ్రాయకుండా అంత తొందరగా వచ్చినందుకు మా నాన్నకు నాపై అనుమానం కలిగింది.

దీపావళినాటి రాత్రి మా నాన్న నా పెళ్లి ప్రస్తావన తెచ్చాడు. నాకిప్పట్లో పెళ్లి చేసుకోవాలని లేదన్నాను.

"ఎవరినైనా ప్రేమిస్తున్నావా చెప్పరా! ఆ అమ్మాయితోనే పెళ్లి జరిపిస్తాను" అన్నాడు కొంచెం గంభీరంగా.

"అవును" అన్నాను నేను ధైర్యం తెచ్చుకుంటూ.

"ఎవరా అమ్మాయి?" అడిగాడు నాన్న.

"ఆ ఎదురింటి అమ్మాయి— సుజాత" బదులిచ్చింది మా అమ్మ.

"అయితే మా మాట కూడా విను. మన కులం కాకపోయినా ఆ అమ్మాయితో నిజంగా పెళ్లి జరిపిస్తాను. రేపే ఆ అమ్మాయిని తీసుకురా పెళ్లి జరిపిస్తాను. కానీ ఆ తర్వాత ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. నీకు మాకు ఎటువంటి సంబంధాలు వుండవు. ఎందుకంటే నేను మన పల్లెటూర్లో 'రెడ్డి'గా వుంటూ పరువు మర్యాదలతో బ్రతుకు తున్నాను. అక్కడ నా పరువు, మర్యాదలకు ముప్పు వస్తుంది. అర్థమైందా?" అన్నాడు కొంచెం అసహనం, కొంచెం విషాదం కలగలసిన స్వరంతో.

"నేను పెళ్లి చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను" అన్నాను మొండిగా.

"సరే నీ ఇష్టమే కానీ! నీ సంతోషమే మాకు ముఖ్యం" అన్నాడు నాన్న బాధపడుతూనే. అమ్మ కూడ బాధపడుతోందని నేను వేరే చెప్పనవసరం లేదు.

అయితే నాకు మాత్రం ఆ రాత్రి చాలా ఆనందంగా వుండింది— మా నాన్న మనసు కష్టపెట్టి అయినా సరే ఒప్పించినందులకు. ఎప్పుడెప్పుడు సుజాతతో ఈ విషయం చెబుదామా అని ఒకటే ఆలోచన. ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు. తెల్లవారింది.

సాయంత్రం కూడ అయ్యింది. సుజాత వాళ్ల వరండాలో కన్పించలేదు. దిక్కుతోచక రైల్వే స్టేషన్ ఓవర్ బ్రిడ్జి మీదకు వెళ్లాను. అక్కడ కూడ కన్పించలేదు. నిరాశతో తల క్రిందకు దించాను. స్టేషనులో కూర్చుని వుంది సుజాత. క్రిందనుండి నన్నుచూసి బ్రిడ్జి మీదకు వచ్చింది.

"ఏమిటి సుజా! నీకోసం నేను అంత దూరం నుండి వస్తే కనీసం కన్పించడం కూడా మానేశావేం" అన్నాను.

శూన్యంలోకి చూస్తూ "వంశీ! నీవు నన్ను మరచిపోవాలి" అంది.

"జోక్ చెయ్యకు! నేను నిన్ను మరచిపోవడమేమిటి? అది నాకీ జన్మలో

సాధ్యం కాదు'' అన్నాను నవ్వుతూ.

''లేదు వంశీ! నీవు నన్ను పూర్తిగా మరచిపోవాలి అంతే'' మరింత బిగ్గరగా అంది ఈసారి నావైపు చూస్తూ.

''ఎందుకు?'' అన్నాను, విషాదంతో గొంతు పూడుకుపోతుంటే.

''మా అమ్మానాన్నలకు మన విషయం తెలిసిపోయింది. మన కులాలు వేరని కోప్పడ్డారు. మా వాళ్లు మన పెళ్లికి ఒప్పుకోలేదు'' అంది.

''అయితే'' అన్నాను అదే విషాదం నిండిన గొంతుతో.

''నీవు నన్ను శాశ్వతంగా మరచిపోవాలి'' అంది స్థిరంగా.


ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు భయంకరమైన మౌనం. నా కాళ్లక్రింద వున్న బ్రిడ్జి కూలిపోయి అలాగే నేను పాతాళంలోకి కూరుకుపోతున్నట్లు నా మనసు నిండా మూగవేదన. ఎంతగానో నన్ను ప్రేమించి, నా మీదనే ఆశలు పెట్టుకొన్న నా అమ్మానాన్నలను సైతం ఎదిరించింది— ఈ మాటలు వినడానికేనా? నా మనసు విపరీత విషాదంతో రోదిస్తోంది. నా మనసును ఓదార్చడానికా అన్నట్లుగా నా కళ్లు రెండు వర్షించడానికి ఉపక్రమిస్తున్నాయి.

బ్రిడ్జికి దగ్గరగా వున్న ఒక గుడిసె హోటల్‌లో నుండి రేడియోలో ఒక పాత కాలం పాట ''ఆడవాళ్లు ఆడుకునే ఆటబొమ్మ ఈ మగవాడూ— ఆడుకున్నా ఫరవాలేదు పగులగొట్టి పోతారెందుకూ— పగులగొట్టి పోతారెందుకు'' అంటూ స్పష్టంగా వినిపిస్తోంది ఇద్దరికీ.

''అంతేనా?'' అన్నాను గట్టిగా ఏడుస్తూనే చివరికెలాగో.

''అవును! అంతే!'' అని కఠినంగా చెప్పి విసవిసా వెళ్లిపోయింది.

కళ్లనీళ్లు తుడుచుకుని ఇంటికెళ్లాను. పండుగ పూట భోజనం కూడ చేయకుండా తిరుగు ప్రయాణానికి సిద్ధం అయ్యాను.



"ఏమైందిరా నీ కివాళ? నీ ఇష్టప్రకారమే పెళ్లి జరిపిస్తాం గదా!" అన్నాడు నాన్న.

"నేను ఇప్పుడేమీ మాట్లాడలేను. నన్ను ఒంటరిగా వదిలెయ్యండి. తర్వాత ఉత్తరం వ్రాస్తాను. ఇక నన్ను వెళ్లనీ" అంటూ సూట్ కేస్ తీసుకుని బస్టాండుకు బయల్దేరి ఆ తర్వాత కామారెడ్డి చేరుకున్నాను.

అలాగే బ్యాంక్‌కు వెళ్లివచ్చాను. సాయంత్రం రాత్రిలో కలిసిపోయింది. మనసంతా ఒకటే దుఃఖం. నిద్రపట్టడం లేదు. చలంగారి 'ప్రేమలేఖలు' చదవడం మొదలెట్టాను. అర్ధరాత్రి దాటి 3 గంటలు కావస్తోంది. అలసటతో కళ్లు మూసుకున్నాను.

"జీవించినందుకు రెండే ఫలితాలు— తీవ్రమైన ప్రేమతో జీవితం వెలగాలి— లేదా విరహంతో కాలిపోవాలి" చలం మాటలు నా మనసులో మార్మోగుతున్నాయి.

తలంతా భారంగా వుంది. నిద్రమాత్రలు రెండు వేసుకున్నాను. కళ్లు మూతలు పడుతున్నాయి. అలాగే మగతగా నిద్రలోకి జారుకున్నాను.

"మీదంతా వట్టి భ్రమ! మీదంతా వట్టి భ్రమ!" అంటూ సుజాత వికృతంగా నవ్వుతూనా ముందు నిలుచునుంది.

కళ్లు విదిలించి చూశాను. రూమ్‌లో వేరే ఎవ్వరూ లేరు. నేను ఒక్కడే ఉన్నాను. నిరాశతో ఎడమవైపుకి ఒరిగాను.

నా ప్రక్కనే 'ప్రేమలేఖలు' పుస్తకం. దానిపై మాసిన గడ్డంతో నవ్వుతూ— నా గురువు— గుడిపాటి వెంకటచలం.

★

